క్లుప్తంగా

నమ్మకమైన సేవలందిస్తున్నాం



హన్మకొండ చౌరస్తా: వినియోగదారులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యమైన, అధునాతన సేవలందిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ మేనేజర్ రితీష్‌కుమార్ అన్నారు. హనుమకొండ చౌరస్తాలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖను యాదవనగర్‌లో పెట్రోల్‌బంక్ సర్కిల్‌లోకి ఆదివారం మార్చారు. ఈమేరకు నూతన శాఖను రితీష్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ మొబైల్ యాప్ ద్వారా కస్టమర్లకు 250 రకాల సేవలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రీజనల్ మేనేజర్ సీవీఎస్ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్ అజ్మీర సతీష్ కుమార్, కేయూ బ్రాంచ్ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మడికొండ: యాభై ఏళ్ల మహిళ అదృశ్యమైన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన మునిగాల సుజాత ప్రతీరోజులాగే శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 5 గంటలకు హోటల్‌లో పని చేయడానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో మడికొండ పోలీసు స్టేషన్‌లో ఆమె భర్త మునిగాల రాజయ్య శనివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు. ఆచూకీ తెలిస్తే 87126 22302 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కళా మహోత్సవానికి మంజుల

హన్మకొండ చౌరస్తా: ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న భారతీయ కళాంకార్ సంఘ్ కళా మహోత్సవానికి తనకు ఆహ్వానం అందినట్లు హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన ఆర్టిస్ట్ సాగంటి మంజుల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆర్టిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న కళా మహోత్సవాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ఆర్టిస్టులు పాల్గొంటారని మంజుల పేర్కొన్నారు. ఆర్టిస్టుల సమస్యలపై సమీక్ష, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు.

గాయకుడు శ్యామ్‌కు సన్మానం



వరంగల్ చౌరస్తా: న్యూయార్క్‌లో తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఎన్వైటీటీఏపై వెళ్తున్న ప్రముఖ సినీ గాయకుడు కాసర్ల శ్యామ్‌ను లయన్స్ క్లబ్ పోతన ప్రతినిధులు వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా గాయకుడు సినీ గేయాలతో కొద్దిసేపు అలరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గండె నవీన్, గిరిధర్, ఆడెపు రవీందర్, రత్నాకర్, జనగాం రాము, వేణుగోపాల్, గోపి పాల్గొన్నారు.

ఏప్రిల్ 27న 'సింహగర్జన'

నయీంనగర్: హనుమకొండ కేడీసీ మైదానంలో ఏప్రిల్ 27న నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సింహగర్జన మహాసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎస్ఎస్‌బీఎం జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశంలో 78శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఏనాడూ రాజ్యాధికారం చేపట్టలేదని వాపోయారు. వారందరిని ఏకంచేసి రాజ్యాధికారం సొంతం చేసుకోవడమే తమ ప్రధాన ధ్యేయం అని అన్నారు. సమావేశంలో పుచ్చల రాంబాబు, ఉదయ్‌కుమార్, సాంబయ్య, అంజలి, కరుణ, సమ్మయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇంజినీర్ హఠాన్మరణం

హన్మకొండ: గుండెపోటుతో టీజీ ఎన్పీడీసీఎల్ సబ్ ఇంజినీర్ చిట్టి నిఖిల్ రెడ్డి (28) శనివారం హఠాన్మరణం చెందారు. హనుమకొండ జిల్లా మండల కేంద్రమైన కమలాపూర్ సబ్ డివిజన్‌లో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నిఖిల్ రెడ్డి కాజీపేట విష్ణుపురి కాలనీలో నివాసముంటున్నారు. ఈమేరకు టీజీ ఎన్పీడీసీఎల్ సీజీఎం కర్నాటి వరుణ్ రెడ్డి, తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, అసోసియేషన్ నాయకులు, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు, అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు.

బెదిరించిన కేసులో వ్యక్తి అరెస్ట్



వరంగల్: దేశాయిపేట శివారులోని ఎంహెచ్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లోని స్థలాలను కొనుగోలు చేసిన మహిళలను బెదిరించిన కేసులో కాశిబుగ్గలోని వివేకానంద కాలనీకి చెందిన దుబ్బ శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ శుక్రవారం రాత్రి తెలిపారు. సమావేశంలో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ పాల్గొన్నారు.

సమస్యల అడ్డా.. పెద్దమ్మగడ్డ

- అస్తవ్యస్తంగా సైడ్ డ్రెయినేజీ వ్యవస్థ
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు



ధ్వంసమైన అంతర్గత సీసీ రోడ్డు



డ్రెయినేజీ లేక నిలిచిన మురుగు నీరు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో సమస్యలు తిష్ట వేశాయి. అస్తవ్యస్తంగా మారిన సైడ్ డ్రెయినేజీలు, అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రజలు వేడుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. నాలుగు వేల జనాభా కలిగిన పెద్దమ్మగడ్డలో నాలుగైదు కుటుంబాలు మినహాయిస్తే మిగిలిన వారందరూ దళితులే.


అమలుకాని హామీలు

పెద్దమ్మగడ్డ అభివృద్ధి పట్ల ప్రజాప్రతినిధుల హామీలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. ఎన్నికల సమయంలోనే దళితుల పట్ల ఎనలేని ప్రేమను కురిపించిన నాయకులు.. ఆ తర్వాత అటు వైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని ముక్తకంఠంతో వాపోతున్నారు.

ఎక్కడ చూసినా సమస్యలే..

పెద్దమ్మగడ్డలో ఏ గల్లీలో చూసినా అంతర్గత సీసీ రోడ్లు అధ్వానంగా కనిపిస్తుంటాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దాంతో అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. వర్షాకాలంలో వరద నీరుతో డ్రెయినేజీలు ఉప్పొంగి ఇళ్లల్లోకి మురుగు నీరు వస్తోందని ప్రజలు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఒకపక్కకు ఒరిగి కూలేలా ఉన్నాయి. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.





పక్కకు ఒరిగిన స్తంభం, కిందికి వేలాడుతున్న తీగలు

అనేక ఇబ్బందులు పడుతున్నాం



ఓట్లప్పుడు రోడ్లు వేస్తాం, మురుగు కాల్వలు కట్టిస్తాం, ఏం ఇబ్బంది లేకుండా చూస్తామని నాయకులు చెప్పి, ఓట్లు దండుకుని ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– మొలుగూరి పూలమ్మ, పెద్దమ్మగడ్డ

స్తంభాలు విరిగేలా ఉన్నాయి



మా గల్లీలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, విరిగిపడేలా ఉన్నాయి, ఈదురు గాలులు గట్టిగా వీస్తే ఎప్పుడు కూలుతాయేనని భయపడుతున్నాం. కొత్త స్తంభాలను వేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– ల్యాదెళ్ల రవి, పెద్దమ్మగడ్డ

ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

మామునూరు: ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ధర్మారావు అన్నారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థలం వద్ద బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ కటౌట్‌కు పాలు, పుష్పాభిషేకాలను శనివారం నిర్వహించారు. బీజేపీ నేతలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గజ్జల శ్రీరాములు, రావు పద్మ, డాక్టర్ కాళీప్రసాద్, కుసుమ సతీష్, రత్నం సతీష్, కార్పొరేటర్ జలగం అనిత, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవి పేరు పెట్టాలి

ఖిలా వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అభివృద్ధి చెందనున్న మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు రాణి రుద్రమదేవిగా నామకరణం చేయాలని సామాజిక న్యాయవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ కోరారు.

కాకతీయుల పేరు పెట్టాలి

హన్మకొండ: మామునూరు విమానాశ్రయానికి కాకతీయుల పేరు పెట్టాలని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి కోరారు. అంతర్జాతీయ విమానాశ్రయంగా ఏర్పాటు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన జీఎంఆర్ ఒప్పందమే ఇన్నాళ్ల నిరీక్షణకు కారణమని పేర్కొన్నారు.

విమానాశ్రయం ఏర్పాటు హర్షణీయం



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా ప్రజల హృదయాల్లో రేవంత్‌రెడ్డి చిరకాలం నిలిచిపోతారని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, నాయకుడు అనిల్‌రావు తదితరులు ఉన్నారు.

మాదిగ అమరుల దినోత్సవం



జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగినప్పుడే మాదిగ అమరుల ఆత్మకు శాంతి కలుగుతుందని సంఘం నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఈమేరకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో మాదిగ అమరుల దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్

విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షైన్ యాజమాన్యం

హన్మకొండ: పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్ అన్నారు. హంటర్ రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ శివనగర్‌లోని షైన్ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నామని, పాఠ్య పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానంతో పాటు మెలకువలు నేర్పిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్ మూగల రమ, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గోల్డెన్ ఓక్'లో ఎడ్యుకేషన్ ఫెయిర్



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని కాపువాడలోని గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ప్రగ్యా ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ దీప్తి శనివారం తెలిపారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లు, మోడళ్లను రూపొందించి, ప్రదర్శించి తమ ప్రతిభను చాటారు. సాంకేతికత, పర్యావరణ, ఖగోళశాస్త్రం, ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో ప్రాజెక్టులు రూపొందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ గంట రవికుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కౌటిల్య స్కూల్‌లో విజ్ఞానోత్సవం



ఎగ్జిబిట్లను వివరిస్తున్న విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ వికాస్‌నగర్‌లోని కౌటిల్య స్కూల్‌లో శనివారం విజ్ఞానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వాటిని పాఠశాల కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్ శాలిని పరిశీలించి వాటి ప్రాముఖ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి విజ్ఞానోత్సవాన్ని నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజని, వైస్ ప్రిన్సిపాల్ అనిత, సైన్స్ ఉపాధ్యాయులు అనూష, రాధిక, సింధు, అక్బర్‌పాషా, అలీఖాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

గర్భస్థ శిశువుకు ఆపరేషన్ విజయవంతం



శిశువును తల్లికి అప్పగిస్తున్న వైద్యులు

హన్మకొండ అర్బన్: గర్భస్థ శిశువుకు ఉన్న అరుదైన వైకల్యాన్ని అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా గ్రవిడ్ హోం వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా వైద్యులు శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం ఉమ్మనీరు సమస్యతో గర్భిణి మంజుల ఆస్పత్రిలో చేరింది. ఆమెకు వైద్యురాలు రమ్య వందనశెట్టి తమ వైద్య బృందంతో కలిసి ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. శిశువుకు శ్వాస నాళం, ఆహార నాళం అభివృద్ధి చెందకపోవడంతో పాటు అతుక్కుని ఉండటంతో అత్యవసర శస్త్ర చికిత్స చేశారు.

'మిలిటెంట్' పోరాటాలకు సిద్ధం కావాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

హన్మకొండ: మాలలు మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని మాల మహానాడు ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం శనివారం జరిగింది. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానాడు జిల్లా అధ్యక్షుడు బొల్లం రాంకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, ప్రొఫెసర్ సదాశివుడు, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

వరంగల్ చౌరస్తా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వరంగల్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో వరంగల్ జిల్లా కమిటీ సమావేశం సంఘ ఉపాధ్యక్షుడు ఊరటి హంసారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు పుచ్చకాయల బుచ్చిరెడ్డి, మోకిడి పేరయ్య, జెండా అంబయ్య, నల్ల విజేందర్, జంగ జనార్ధన్ రెడ్డి, రేముడాల దామోదర్ రెడ్డి, సిరుల రవీందర్, తిప్పారపు రాజు, సోమిడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే' సమస్యల పరిష్కారానికి కృషి



వీరన్న, రాజశేఖర్‌తో కార్యవర్గ సభ్యులు

కాజీపేట రూరల్: రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వీరన్న, ఏఆర్.రాజశేఖర్ తెలిపారు. కాజీపేట కార్యాలయంలో కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ ఇంజనీరింగ్ బ్రాంచ్, లోకోరన్నింగ్ బ్రాంచ్, మెడికల్ అండ్ సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచీల జనరల్ బాడీ సమావేశం శనివారం జరిగింది. అనంతరం సికింద్రాబాద్ డివిజన్ కార్యవర్గ సమక్షంలో కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ బ్రాంచ్, మెడికల్ అండ్ సీఅండ్‌డబ్ల్యూ టీఆర్‌డీ, ఎస్అండ్‌టీ బ్రాంచ్, లోకోరన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే అసోసియేషన్ ఎన్నిక

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లకొండ చంద్రమోహన్, కార్యదర్శిగా మారేడు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంపత్, ఆర్గనైజర్ సెక్రటరీలుగా పూర్ణచందర్, పోలెపాక రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేయూలో వర్క్‌షాప్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్స్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ది నేషనల్ సైన్స్ అకాడమీ ఆఫ్ ఇండియా సహకారంతో ఈనెల 5, 6వ తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు అప్లికేషన్స్ ఆఫ్ రికాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీ ఇన్ హెల్త్ కేర్ అనే అంశంపై నిర్వహించనున్న వర్క్‌షాప్ పోస్టర్లను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ షమిత, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ హనుమంతు, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ అనితారెడ్డి, జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, వెంకయ్య, సెట్ డైరెక్టర్ డాక్టర్ మేఘనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దశాబ్దాల కల సాకారం

హన్మకొండ: మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించాలనే దశాబ్దాల కల సాకారం కానుందని ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తిరుణహరి శేషు అన్నారు. హనుమకొండ సుబేదారిలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానాశ్రయ పునరుద్ధరణకు కావాల్సిన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి, విమానాశ్రయ అభివృద్ధికి అనుమతులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విమానాశ్రయ పునరుద్ధరణకు చొరవ చూపిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, విమానాశ్రయ పునరుద్ధరణ కోసం ఉద్యమాలు చేసిన ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, పుల్లూరి సుధాకర్, ఇతర ఉద్యమకారులకు శేషు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అంతర్ రాష్ట్ర సాంస్కృతిక ఉత్సవం

నయీంనగర్: చారిత్రక వేయిస్తంభాల గుడి ప్రాంగణంలో కేరళ – తెలంగాణ జానపద కళా సాంస్కృతిక ఉత్సవం ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం డీడీ అన్వేష్ చింతల, కూరపాటి ఆస్పత్రి ఎండీ డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన

వరంగల్: కార్మిక బీమా సంస్థ 74వ వార్షికోత్సవం సందర్భంగా 2వారాల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఈఎస్ఐ కార్పొరేషన్ పిలుపు మేరకు వరంగల్ కరీమాబాద్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జగదీష్‌బాబు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది నరేందర్, సుజి, శ్రీధర్, రవీందర్, హైమావతి, భాగ్య, ఉమ, రవి, ప్రజ్ఞ, కమల్, సారంగపాణి, కుమారస్వామి, భవాని, వినయ్ పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యం వేధిస్తోంది

ఎంజీఎం: కళాశాల యాజమాన్యం తనను వేధింపులకు గురి చేస్తోందని వరంగల్ ఎల్‌బీ బీఎడ్ కళాశాలలో ఫిలాసఫీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నుంచి క్లాస్‌లు బోధించకుండా ఉండేలా కళాశాల సెక్రటరీ ప్రేమ్ కుమార్ రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆమె వాపోయారు. న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

హన్మకొండ: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని టీజీ ఎన్పీడీసీఎల్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ స్టేషన్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ హెచ్చరించారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు మీటర్ తిరగకుండా చేస్తామని వినియోగదారుల వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని మీటర్‌లోని కొన్ని వైర్లు కట్‌చేస్తూ రీడింగ్ నమోదు కాకుండా చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా చేయడం విద్యుత్ చౌర్యం కిందికు వస్తుందని, ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. మీటర్‌లో వైర్లు కత్తిరించి రీడింగ్ నమోదు కాకుండా చేసిన హనుమకొండ చౌరస్తాలోని రెడీమేడ్ బట్టల వ్యాపారి ఆడెపు నవీన్‌పై హనుమకొండ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న హనుమకొండలోని కొన్ని కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు విద్యార్థి సంఘం బాధ్యులతో కలిసి హనుమకొండ డీఐఈఓ కార్యాలయంలో ఉద్యోగికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా పదో తరగతి పరీక్షలు కూడా మొదలు కాకముందే కొన్ని కళాశాలల యజమానులు ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, జిల్లా సమితి సభ్యులు వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపు

హసన్‌పర్తి: క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతోందని హనుమకొండ డీవైఎస్ఓ, భారత రెజ్లింగ్ జట్టు మాజీ కోచ్ అశోక్‌కుమార్ అన్నారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రొఫెషనల్ కాలేజియేట్ క్రీడాపోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

వరంగల్: తెలంగాణ ఆర్థోపెడిక్ అసోసియేషన్ (టోసా) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంకుమార్‌రెడ్డిని వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కోశాధికారిగా ఎన్నికైన డాక్టర్ దిడ్డి శ్రవణ్‌కుమార్, ఈసీ సభ్యులు వైద్యులు కోడం రాంమోహన్, దొడ్డ ప్రసాద్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ కాసర్ల తిరుపతిరెడ్డి, డాక్టర్ అజీత్ మహ్మద్, డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ హెచ్.సంధ్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ కస్తూరి ప్రమీల, డాక్టర్ హరీష్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చైత్ర, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ కలీం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఏ సభ్యులకు సన్మానం

హన్మకొండ: ఖమ్మం జిల్లా ఆర్టీఏ సభ్యుడు గజ్జల్లి వెంకన్న, పెద్దపల్లి ఆర్టీఏ సభ్యుడు మంథని సురేష్‌ను కాంగ్రెస్ జాతీయ జాయింట్ కో ఆర్డినేటర్ ఉల్లెంగల యాదగిరి ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. హనుమకొండలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు గజ్జల్లి వెంకన్న, మంథని సురేష్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి యాదగిరి సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, నాయీ బ్రాహ్మణ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సింగారపు శ్యామ్, రజక సంఘం నగర అధ్యక్షుడు ఇల్లందుల సంతోష్, మేదరి సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మేదరి విశ్వనాథ్, పూసల సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కిషన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా అయిలయ్య

కాజీపేట: స్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం కాజీపేట డివిజన్ అధ్యక్షుడిగా కుంచం అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా చిట్టి అశోక్ ఎన్నికయ్యారు. కాజీపేట సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడిగా అభిలాష్

హసన్‌పర్తి: జాతీయ మానవ హక్కుల కమిటీ హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షుడిగా వంగపహాడ్‌కు చెందిన అభిలాష్ నియమితులయ్యారు. నగరంలోని శనివారం జరిగిన సమావేశంలో అభిలాష్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఖిలా వరంగల్: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శనివారం జరిగిన సమావేశంలో సీహెచ్ హరీశ్, శివకుమార్, శరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.